# అర్బన్ కిసాన్ ఫామ్స్‌తో ఒప్పందం



అర్బన్ కిసాన్ ఫామ్స్, కొండాలక్ష్మణ్ విశ్వవిద్యాలయం మధ్య ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

**ఉద్యాన పంటలపై పరిశోధన సమాచారాన్ని పంచుకుంటాం**

గజ్వేల్/ములుగు, డిసెంబర్ 13: కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, అర్బన్ కిసాన్ ఫామ్స్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్‌తో ఉప కులపతి డాక్టర్ బి.నీరజాప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పంద ప్రధాన ఉద్దేశం ఓక్రా, చిల్లి, చెర్రి, టమాట పంటల పరిశోధన అభివృద్ధిపై దృష్టి సారిస్తూ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న ఉద్యాన పంటల పరిశోధన సమాచారాన్ని పంచుకుంటాయి. ఈ ఒప్పందంలో అర్బన్ కిసాన్ ఫామ్స్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్ తరపున డాక్టర్ సాయిరాంరెడ్డి, డాక్టర్ భగవన్, రిజిస్టర్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ విజయ, అర్బన్ కిసాన్ ఫామ్స్ సీఈవో డాక్టర్ శ్రీనివాసన్, నర్సిరెడ్డి, విహారీ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి

- పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలి
- విధి నిర్వహణలో ప్రజలకు సహకరించాలి
- బందోబస్తులో ఏఆర్ సిబ్బంది కీలకపాత్ర పోషించాలి
- ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ దర్బార్‌లో సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, డిసెంబర్ 13: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు రిజర్వు పోలీసు సిబ్బంది పాటుపడడంతో పాటు పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేందుకు ప్రయత్నించాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ దర్బార్ నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు పోలీసు యంత్రాంగం సహకరిస్తూ శాంతిభద్రతలను కాపాడేందుకు ముందుండాలన్నారు. సమాజ పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని, ప్రజలతో మమేకవుతూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పోలీసుల గౌరవాన్ని దిగజార్చకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయిలో సిబ్బందిపై ఉంటుందన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు విధుల్లో(ఏఆర్) సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు.




ఏఆర్ పోలీసు దర్బార్‌లో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

ఏఆర్ పోలీసుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్పీ భరోసానిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అశోక్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్యాణ, ఏఆర్ డీఎస్పీ జనార్దన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, రామరావు, హన్మిరెడ్డి, ఆర్ఎస్‌లు, డీపీవో సిబ్బంది ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏసీ బస్సులు సిద్ధం..

- రేపటి నుంచి సికింద్రాబాద్-పటాన్‌చెరువు మధ్య ఈ-మెట్రో ఏసీ బస్సులు
- ఆర్టీసీ గ్రేటర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వెల్లడి

సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏసీ బస్సులను పునరుద్ధరిస్తూ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. ఈమేరకు నగరంలో ఎనిమిది ఈ–మెట్రో ఏసీ బస్సులను నడిపించాలని ఆర్టీసీ గ్రేటర్ జోన్ అధికారులు నిర్ణయించారు. కరోనా కంటే ముందు తిరిగిన ఏసీ బస్సులు ఆ తర్వాత నగరంలో కనుమరుగయ్యాయి. దీంతో ప్రయాణికుల అవసరాల దృష్ట్యా.. తిరిగి నగరంలో ఏసీ బస్సులను నడిపించాలని ఆర్టీసీ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 15 నుంచి ఏసీ బస్ సర్వీసులను ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరువు (రూట్ నంబర్ 219) ప్రాంతాల మధ్య మొత్తం ఎనిమిది ఏసీ బస్సులు నడుపుతామన్నారు. ఈమేరకు షెడ్యూల్ కూడా విడుదల చేశారు. సికింద్రాబాద్ నుంచి వయా ప్యారడైస్, బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి మీదుగా వీటిని నడిపిస్తారు. ప్రతి 24 నిమిషాలకు ఒక బస్ సర్వీసు అందుబాటులో ఉంటుందన్నారు. సికింద్రాబాద్ నుంచి ప్రతిరోజూ ఉదయం 6.10 గంటలకు ప్రారంభమవుతుంది. చివరి బస్సు రాత్రి 8.28 గంటలకు ఉంటుందన్నారు. పటాన్‌చెరువు నుంచి తొలి బస్సు ఉదయం 7.45కు బయలుదేరుతుందని, చివరి సర్వీసు 10.03 గంటలకు ఉంటుందన్నారు.








సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్, హాజరైన డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు

## పెండింగ్ కేసులు
# త్వరగా పరిష్కరించాలి

- కేసుల ఛేదనకు ప్రణాళిక ఉండాలి.. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, డిసెంబర్ 13: సమాజంలో పలు రకాల కేసుల్లో నేరం చేసిన వారికి శిక్ష పడితేనే నేరాలు తగ్గుతాయని, ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని, పెండింగ్ కేసుల పరిష్కారం త్వరగా పూర్తిచేయాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో నేర సమీక్షపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల ఛేదనకు పోలీసు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకొని విచారణ చేయాలన్నారు. కాలనీలు, పట్టణాలు, గ్రామాల్లో చోరీలను అరికట్టేందుకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సహించాలని సూచించారు. పెండింగ్‌లో(అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల దర్యాప్తులో వేగంపెంచి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి నేరస్తులను న్యాయస్థానం ముందు హాజరుపర్చాలని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. కేడీ, సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, అలవాటుపడిన నేరగాళ్లను బైండోవర్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పార్ట్‌లుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు రోడ్డు నిర్మాణ లోపాలున్నట్లైతే సంబంధిత అధికారులకు తెలియజేసి మరమ్మతులు చేయించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలపై తరచూ అవగాహన కలిగించాలన్నారు. బైక్ రైడర్స్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన లేమి, డబ్బులు ఫ్రీగా వస్తాయని, చెప్పగానే అశపడి సైబర్ నేరగాళ్లకు ఓటీపీ, పాస్‌వర్డ్ చెప్పడం, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనవసర లింకులు ఓపెన్ చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని, ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సమీక్ష సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, సంగారెడ్డి సబ్‌డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## సీజన్ మొదలైంది..
# జాగ్రత్తగా నడపండి..

- పొలం పనుల్లో 37శాతం వాహన ప్రమాదాలు ట్రాక్టర్లవే
- ట్రాక్టర్ల పల్టీతో తరుచూ రైతులు, డ్రైవర్ల మృత్యువాత
- అవగాహన, అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ
- యాసంగిలో మొదలైన ట్రాక్టర్ల వినియోగం



**పంట పొలాల్లో** ఎడ్ల నాగలితో వ్యవసాయ పనులు చేయడం, పంట ధాన్యాన్ని, పంటకు అవసరమైన వస్తువులను ఎడ్ల బండ్లలో చేరవేసుకునే రోజులు పోయి చాలా కాలమైంది. వ్యవసాయంలో వాహన, యంత్ర వినియోగం కొనసాగుతున్నది. ఇందులో ట్రాక్టర్ వినియోగం సర్వసాధారణంగా మారింది. దుక్కి దున్నడం, గొర్రొప్పడం, వరినారు దాటించడం, విత్తనాలు, వరినాట్లు వేయడం, ఎరువులు, విత్తనాల బస్తాలు చేరవేసుకోవడం, పంట దిగుబడి ధాన్యాన్ని తరలించుకోవడం, వ్యవసాయ కూలీలను చేరవేయడం తదితర పనులెన్నో ట్రాక్టర్ల ద్వారానే జరుగుతున్నాయి. పంట పొలాల్లో వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాక్టర్లు తిరగబడి పోయిన ప్రమాదాల్లో రైతులు, డ్రైవర్లు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు తరచూ ఎక్కడో ఒక చోట చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ ప్రమాదాలతో అన్నదాతలు, డ్రైవర్లు మృత్యువాత పడుతుండడంతో వారి కుటుంబాల్లో తీరని విషాదం మిగులుతున్నది. అన్నం పెట్టే పంట భూముల్లో అర్ధాయుష్షు దృశ్యాలు హృదయ విదారకంగా ఉంటున్నాయి.

– నిజాంపేట, డిసెంబర్ 13

### ప్రమాదాలకు కారణాలు

- దమ్ము చేసే సమయంలో మడిలో లోతు అంచనా రాకపోవడంతో చక్రాలు దిగబడి పోయి బోల్తా కొట్టడం.
- ఒడ్లు ఎక్కించేప్పుడు, దాటించేప్పుడు ఎత్తు, ఒడ్డు మట్టి గట్టిగా ఉందా లేక వదులుగా ఉందా అనేది అంచనా దొరకకపోవడం.
- పాత బావులు, కాలువలు, ఏండ్ల కొద్దీ ఉన్న నీటి మడుగుల స్థానంలో పొలాలు చేసిన భూముల్లో మట్టి ఊబిలాగా దిగబడేలా మారడం.
- డ్రైవింగ్ సీటు సౌకర్యవంతంగా లేకపోవడం.
- డ్రైవింగ్ చేసే వ్యక్తి లుంగీ, ప్యాంటు, ధోతి, ఇతర దుస్తులు, రుమాల్లు కేజ్ వీల్ చక్రాలు, ఇంజిన్ భాగాల్లో ఇరుక్కోవడం.
- మద్యం సేవించి, జ్వరం తదితర అనారోగ్య స్థితిలో ఉన్నప్పుడు నడపడం.
- త్వరత్వరగా పని పూర్తిచేయాలనే ఒత్తిడికి గురై ఆదరాబాదరాగా నడపడం.
- ధాన్యం, వస్తువులను అన్‌లోడ్ చేసేందుకు ట్రాక్టర్ ట్రాలీని పైకి ఎత్తినప్పుడు విద్యుత్ వైర్లకు తగలడం లాంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

### జాగ్రత్తలతోనే నివారణ

- సరైన జాగ్రత్తలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించుకోవచ్చు.
- సాంకేతికంగా కూడా అవగాహన కలిగి ఉండాలి.
- ట్రాక్టర్ స్థిరత్వం కోసం ముందు ఇరుసు సుమారు 30 నుంచి 35 శాతం బరువుతో, వెనుక ఇరుసు సుమారు 65 నుంచి 75 శాతం బరువుతో ఉంటుంది.వెనుక చక్రాలు దిగబడినప్పుడు, ఒడ్లు ఎక్కించే సమయంలో పికప్ ఒత్తిడితో ముందు భాగం లేచి ట్రాక్టర్ పక్కకు తిరిగిపోవడం, లేదా బోర్లా పడిపోవడం జరుగుతుంది. ట్రాక్టర్ వెనుక తగిలించే పనిముట్లను ఎక్కువ ఎత్తులో తగిలించకుండా తక్కువ ఎత్తులో తగిలించి ఉంటే ముందు భాగం పైకి లేచినప్పుడు వెనుక భాగం వాలిపోకుండా ఆ పని ముట్టు భూమిని తాకి కొంత వరకు నియంత్రించగలుగుతుంది.

### మొదలైన సీజన్.. జాగ్రత్తలు పాటించాలి..

పంట పొలాల్లో ముఖ్యంగా వరి నాట్లు వేస్తున్న సమయంలో ఈ సంఘటనలు జరుగుతున్నాయి. వానకాలం, యాసంగి పొలాల పనుల ప్రారంభ దశలో ట్రాక్టర్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలోనే ట్రాక్టర్లు బోల్తా కొట్టడం, లేదంటే పొలాల మధ్యలో ఉన్న చిన్నచిన్న దారులు, కల్లాల్లో ట్రాలీ అన్‌లోడింగ్ సమయంలో పైన ఉండే విద్యుత్ వైర్లు తాకడం లాంటి ప్రమాదాలు ఎక్కువగా ఉంటున్నాయి. ట్రాక్టర్లతో వ్యవసాయ పనులు చేయడంలో నేర్పుగా ఉండడం తదితర జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాల బారినపడకుండా చూసుకోవాలి. ప్రస్తుతం యాసంగి సాగు పనులు ప్రారంభమై వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్ల వినియోగం మొదలైనందున రైతులు, డ్రైవర్లు తగు జగ్రత్తలు పాటించాలి.

### ట్రాక్టర్ ప్రమాదాలే ఎక్కువ..

పంట పొలాలు, కల్లాల వద్ద వ్యవసాయ పనుల సమయంలో సంభవిస్తున్న ప్రమాదాలపై జరిగిన పలు అధ్యయనాల ప్రకారం 31 శాతం ప్రమాదాలు వ్యవసాయ ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్నవే. 2శాతం వివిధ మిషన్లు, 4శాతం రసాయన మందుల పిచికారీ, 6శాతం పవర్ టిల్లర్లు, 9శాతం చాప్ కట్టర్లు, 12 శాతం మోటర్లు, పంపుసెట్లు, 14 శా తం నూర్పిడి మిషన్లు, 22 శాతం జంతువుల సాయంతో నడిపే లేదా ఉపయోగించే వ్యవసాయ పరికరాల ద్వారా జరుగుతున్నాయి. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు దారా జరిగే ప్రమాదాలను కలుపుకొంటే 37 శాతం ప్రమాదాలు ట్రాక్టర్ల ద్వారానే జరుగుతున్నాయి.



- టైర్ల వ్యాసం, వెడల్పు ఎక్కువగా ఉండడం మంచిది.
- తరుచూ ట్రాక్టర్ ఇంజిన్ చుట్టూ తిరుగుతూ పరిశీలించాలి.
- టైర్లలో గాలి పీడనం సరిగ్గా ఉండేలా చూసుకోవాలి



# చికెన్ @ ₹180

## దిగొచ్చిన చికెన్ ధరలు
## కిలో రూ.240 నుంచి రూ.180కి..

- లైవ్ కోడి కిలో రూ 120లోపే..
- కొండెక్కిన గుడ్డు ధర
- రూ.4 నుంచి రూ.6కు పెంపు
- ఆనందంలో చికెన్ ప్రియులు
- పౌల్ట్రీ రైతులు, వ్యాపారుల్లో ఆందోళన

రామాయంపేట, డిసెంబర్ 13: కార్తిక మాసం పుణ్యమా అని చికెన్ ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. మొన్నటి వరకు కిలో స్కిన్‌లెస్ రూ.240 ఉండగా, కార్తికమాసం ముగిసే సమయంలో అమాంతం కిలో రూ.180కి దిగొచ్చింది. లైవ్ ధర ఒక్కసారిగా రూ.120 తగ్గడంతో చికెన్ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, ధరలు పడిపోవడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని చికెన్ దుకాణం నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు వినియోగదారులకు సంతృప్తి కలిగిస్తున్నప్పటికీ తగ్గుతున్న ధరలు కోళ్ల ఫారాల రైతులను కుదేలు చేస్తున్నాయి. లేయర్ కోళ్ల పెంపకందారుల పరిస్థితి ఒకరకంగా ఉన్నా బాయిలర్ రైతులు మాత్రం నష్టాల పాలవుతున్నారు. కార్తికమాసం కావడంతో గిరాకీ లేక చికెన్ సెంటర్ నిర్వాహకులు ఊసూరుమంటున్నారు. పౌల్ట్రీ ఫారాలు అధిక సంఖ్యలో ఏర్పాటు చేస్తుండడంతో కోళ్ల ఉత్పత్తి రోజురోజుకూ పెరుగుతుండడం, హైదరాబాద్‌తో పాటు పట్టణాల నుంచి పెద్దపెద్ద సంస్థలు మండలం, గ్రామాలకు వచ్చి మరీ కోళ్లను దుకాణదారులకు విక్రయిస్తుండడం ధరల తగ్గుదలకు కారణాలని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఫౌల్ట్రీ రైతులకు ఈ సీజన్ కష్ట కాలమేనని చెప్పవచ్చు. రామాయంపేట డివిజన్ పరిధిలోని నార్సింగి, రామాయంపేట, చిన్నశంకరంపేట, నిజాంపేట ఎక్కడ ఏ గ్రామంలో చూసినా చికెన్ సెంటర్లు అధికంగా కనిపిస్తాయి.

చికెన్ సెంటర్ల నిర్వాహకులకు పెద్దగా నష్టం లేకపోయినా రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన ఫౌల్ట్రీ రైతులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక లైవ్‌కోళ్ల ధర కూడా దాదాపు కిలో రూ.వంద లోపే విక్రయిస్తున్నారు. దీంతో రైతులు, పరిశ్రమలు పెట్టుకున్న వ్యాపారులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇటు చికెన్ ధరలు పడిపోతుంటే అటు కోడి గుడ్డు ధరలు మాత్రం అమాంతం కొండెక్కి కూర్చున్నాయి. గతంలో ఒక్కో గుడ్డు రూ.4 నుంచి 5 ఉండగా, ప్రస్తుతం రూ.6కు చేరింది. దీంతో ఒకప్పుడు కోడిగుడ్ల కూరతో సరిపెట్టుకున్నవాళ్లు ఇప్పుడు చికెన్ కోసం ఎగబడుతున్నారు. మరో వారం పది రోజులపాటు చికెన్ ధర తగ్గడం, కోడి గుడ్డు ధర పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.





పొలాల్లో పోస్తున్న ఎరువు

## పశువుల ఎరువుకు
# భలే డిమాండ్

- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- పశుసంపద తగ్గడమే కారణం
- ఖర్చు పెరిగినా పంట దిగుబడిపై రైతుల ఆశలు

కొమురవెల్లి, డిసెంబర్ 13: పశువుల ఎరువుకు భలే డిమాండ్ ఏర్పడింది. యాసంగి సీజన్ కోసం ముందస్తుగా పశువుల పేడను పంట పొలాల్లో వేసే పనుల్లో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. పశు సంపద తగ్గడంతో సేంద్రియ ఎరువుల కొరత ఏర్పడింది. దీంతో రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి అధిక ధరకు కొనుగోలు చేస్తూ తమ పంట పొలాలకు తరలిస్తున్నారు.

**భూసారం పెరుగుదల**

పొలాల్లో భూసారం పెరిగేందుకు సేంద్రియ ఎరువులు ఉపయోగపడుతాయి. వరి, మొక్కజొన్న, సజ్జలు, నువ్వులు, వేరుశనగ, కూరగాయ పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. భూసారం పెరిగేందుకు పశువుల పేడ, చెరువు మట్టి చల్లుతారు. ధర పెరిగినప్పటికీ దిగుబడి అధికంగా వస్తుండటంతో రైతులు సేంద్రియ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.


### ట్రాక్టర్‌లోడుకు రూ.4 వేల నుంచి 5 వేలు

ఎరువుల ధరలు ఆకాశానంటుతున్నాయి. ఆయా గ్రామాల్లో పశువుల ఎరువు లభ్యం కాకుంటే సరిహద్దు గ్రామాలకు వెళ్లి పశువుల ఎరువును రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడ్‌కు రూ. 4వేల నుంచి 5 వేల వరకు చెల్లించి కొంటున్నారు. దానికి తోడు ట్రాక్టర్ కిరాయి సైతం అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

### తగ్గిన పశుసంపద

సేంద్రియ ఎరువుకు డిమాండ్ పెరగడానికి పశు సంపద కొరతే ప్రధాన కారణం. వ్యవసాయంలోకి ఆధునిక యంత్ర పరికరాల ప్రవేశంతో ఎద్దులు కనుమరుగయ్యాయి. పశుగ్రాసం దొరకక గేదెలు, ఆవులు సైతం పల్లెల్లో కనిపించేడం లేదు. దీంతో రైతులకు పేడ నిల్వచేసే పరిస్థితి లేకుండా పోయింది.

### కొరత ఉంది



సేంద్రియ ఎరువుల కొరత ఉంది. పశువులు లేక పోవడంతో ధరలు బాగా పెరిగాయి. సేంద్రియ ఎరువులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి కొనుగొలు చేసి పంట పొలాల్లో చల్లుతున్నాం. దీంతో పంటలకు ఎంతో ఉపయోగపడటంతో పాటు అధిక దిగుబడులు వస్తాయి.

*– బచ్చల కొండయ్య, రైతు, గురువన్నపేట*

### సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడులు



సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు వస్తాయి. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమి సారవంతం కావడంతో పాటు ఫర్టిలైజర్స్ కంటే సేంద్రియ ఎరువులతో చేసే వ్యవసాయానికి పెట్టుబడి తక్కువ కావడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు డిమాండ్ ఉండటంతో రైతులకు లాభాలు ఎక్కువగా వస్తాయి.

*– నరేశ్, మండల వ్యవసాయాధికారి, కొమురవెల్లి*



పంట పొలాల్లో వేసిన ఎరువు